క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలి



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్ఎం నాయుడుబాబు

కె.కోటపాడు : అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని కొరువాడ జగన్నాథపురం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పి.నాయుడుబాబు కోరారు. గ్రామంలో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులతో పాటు 5 ఏళ్లు పూర్తయిన చిన్నారుల ఇళ్లకు వెళ్లి సోమవారం తల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు సాగించే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, షూలు, బెల్ట్‌లు ఉచితంగా ప్రభుత్వమే సమకూర్చుతుందని హెచ్ఎం తెలిపారు. పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నట్టు వివరించారు. ప్రతి విద్యార్థి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపనున్నట్లు హెచ్ఎం తెలిపారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.

రేపు సర్వసభ్య సమావేశం

మాకవరపాలెం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 9న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో తప్పక హాజరు కావాలని సూచించారు.

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రుత్తలకు ఘన నివాళి

మాకవరపాలెం: మాజీ జెడ్పీటీసీ రుత్తల శేషుకుమార్‌కు స్పీకర్ అయ్యన్నపాత్రుడు శ్రద్ధాంజలి ఘటించారు. మాకవరపాలెం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రుత్తల శేషుకుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించిన పెద్దకర్మకు స్పీకర్ హాజరై శేషుకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

గండిపేట వీఎస్ఎస్‌లో అవకతవకలపై ఫిర్యాదు

మాకవరపాలెం: గండిపేట వీఎస్ఎస్‌లో జరిగిన అవకతవకలపై విచారణకు చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు భీమబోయినపాలెం సర్పంచ్ రుత్తల నందకిషోర్ తెలిపారు. అనకాపల్లి సెక్షన్ పరిధిలోని గండిపేట వీఎస్ఎస్ ద్వారా వచ్చే ఆదాయం ఏం చేస్తున్నారో తెలియడం లేదని, దీనిపై విచారణ చేయాలని సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామన్నారు. గత మూడేళ్లుగా గండిపేట వీఎస్ఎస్ ద్వారా ఏటా రూ. లక్షల్లో ఆదాయం వస్తోందన్నారు. అయితే ఈ ఆదాయం ఏం చేస్తున్నారో, ఎవరి అకౌంట్‌లో వేస్తున్నారో సభ్యులకు తెలియడం లేదన్నారు. 50 ఎకరాల్లో యూకలిప్టస్ కలప అమ్మకాలు చేశారని, ఈ నగదు సైతం పక్కదారి పట్టిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిబ్రవరి నెలలో డీఏఫ్‌వోకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవని, ఈ వీఎస్ఎస్‌పై పూర్తిస్థాయి విచారణ చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పక్కదారి పట్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత శిక్షణకు యువతీ, యువకుల ఎంపిక

మాడుగుల: ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన కోసం యువతీ యువకులను మండలం నుంచి ఎంపిక చేసినట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ భాగస్వామ్యంతో కంప్యూటర్, తదితర కోర్సుల్లో 90 రోజుల పాటు ఉచితంగా శిక్షణ అందజేయడానికి ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు వివిధ సంస్థల ప్రతినిధులు జేడీఎం కల్యాణి, మోహంత్, రామునాయుడు, 148 మంది యువతీ యువకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



దేవరాపల్లిలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యాధికారి వనజ

దేవరాపల్లి: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.వనజ సూచించారు. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవరాపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బంది నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ పని ఒత్తిళ్లతో ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు హెల్త్ చెకప్‌లు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం.ఆనంద్, పీహెచ్ఎన్ బి.సునీత, హెచ్‌వీ బి.లక్ష్మీ, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, ఏఎన్ఎంలు జి.పుష్ప, ఆర్.సత్యవతి, హైమా, శాంతి, తదితర వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొబ్బరితోటలకు తెల్లదోమ బెడద



శంకరం గ్రామంలో మొక్క దశలో ఉన్న కొబ్బరి తోట



బొండాలతో కొబ్బరి చెట్టు



వి. భాను పుష్పలీలావతి

- నస్యరక్షణ చర్యలతోనే నివారణ సాధ్యం
- మండల ఉద్యానవన శాఖాధికారి భానుపుష్పలీలావతి

మాడుగుల రూరల్: కొబ్బరి తోటలకు తెల్లదోమ బెడద ఎక్కువైంది. దీని నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల ఉద్యానవన శాఖాధికారి వి.భాను పుష్పలీలావతి సూచిస్తున్నారు. కొబ్బరి చెట్లకు సోకే తెల్లదోమ, నివారణ చర్యల గురించి ఆమె సాక్షితో మాట్లాడారు. పసుపు రంగు జిగురు అట్టలు కొబ్బరి చెట్ల కాండంపై విరివిగా వాడుకుని, తెల్లదోమ తల్లి పురుగులు ఆకర్షింపచేసుకోవచ్చునన్నారు. వారానికి ఒక పర్యాయం ఆముదం జిగురు పసుపు రంగు అట్టలకు తప్పనిసరిగా పూయాలని సూచించారు. తోటలో ఉధృతి మేరకు పసుపు రంగు అట్టలను పెంచుకోవచ్చునన్నారు.

- నీరు సమృద్ధిగా లభించినచో 10 గ్రాముల డిటర్జెంట్ పౌడర్‌ను లీటరు నీటికి కలిపి తెల్లదోమ ఆశించిన మొక్కలపై 15 రోజుల వ్యవధిలో పిచికారీ చెయ్యాలి.
- ఇసారియా శిలీంధ్ర ద్రావణాన్ని 5 మిల్లీ లీటరు, ఒక లీటరు నీటిలో కలిపి ఆకులపై పిచికారీ చెయ్యాలి.
- తెల్లదోమ పురుగు స్థాయి ఎక్కువగా ఉండి మిత్ర పురుగులు లేనిచో, ఒక శాతం వేపనూనెకు 10 గ్రాముల డిటర్జెంట్ పౌడర్‌ను కలిపి ఆకు అడుగు భాగాలు పూర్తిగా తడిచేలా 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలని ఏవో సూచించారు.
- తెల్లదోమ ఉధృతి తక్కువగా ఉన్నప్పుడు మిత్ర పురుగు అయిన డైకోక్రైసా ఆస్టర్ 100-150 గ్రుడ్లు మధ్యస్తగా ఉన్నప్పుడు 300-500 గ్రుడ్లు ఒక్కొక్క చెట్టుకు కనీసం 10 శాతం చెట్లకు తోటలో విడుదల చెయ్యాలి.
- తెల్లదోమ సోకిన కొబ్బరి, అన్ని రకాలు మొక్కలను ఒక చోట నుంచి మరొక చోటకు తరలించరాదు. గెంజి, శిలీంధ్ర ద్రావణలను తయారు చేసుకుని, తెల్లదోమ నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని మండల ఉద్యాన వనశాఖాధికారి భాను పుష్పలీలావతి సూచించారు.

మంచినీరు ఇవ్వండి మహాప్రభో!



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గిరిజన మహిళలు

రావికమతం: తాగడానికి మంచినీరు ఇవ్వండి అని చలిసింగం గ్రామానికి చెందిన గిరిజన మహిళలు సోమవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. మండలంలో చీమలపాడు పంచాయతీ చలిసింగం కొండశిఖరం గ్రామంలో 470 కుటుంబాలు ఎస్టీ భగత ఆదివాసి గిరిజనలు జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో బావులు ఉన్నా వేసవి వచ్చిందంటే నీరు ఉండదని, తాగడానికి నీరు కావాలంటే కిలో మీటరు దూరం వెళ్ళి తెచ్చుకోవాలని గిరిజనలు ఆవేదన వ్యక్తం చేశారు. 2022 సంవత్సరంలో నాబార్డ్ నిధుల నుంచి సింగిల్ విలేజేస్ స్కీమ్ కింద రూ.31లక్షలతో సీకే పాడులో బోరు తవ్వి అక్కడి నుంచి కొండపైకి పైపుల ద్వారా నీరు పంపించేందుకు ఏర్పాటు చేశారు. అయితే నీరు రెండు రోజుల ఒక్కసారి మాత్రమే వస్తుందని గిరిజనులు తెలిపారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో అనకాపల్లి కలెక్టర్ స్వయాన మూడు కిలోమీటర్లు కాలి నడకన కొండపైకి వెళ్లి సమస్యలు తెలుసుకుని పనులు త్వరగా చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారని వారంతా గుర్తు చేశారు. పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో మంచినీటి సమస్య తీరలేదని, త్వరగా పనులు పూర్తి చేసి తాగడానికి నీరు అందించాలని కిముడు సరస్వతి, వరలక్ష్మి కోరారు.

ఉత్తమ గురువులకు ఘన సత్కారం

రోలుగుంట: మండలంలో ముగ్గురు ఉత్తమ గురువులకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఘనంగా సత్కరించారు. స్థానిక జూనియర్ కళాశాల గణిత అధ్యాపకుడు సహదేవుడు విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి జిల్లా స్థాయిలోనే సహచర అధ్యాపకుల కృషితో గతేడాది మెరుగైన ఫలితాలు సాధించి రాష్ట్రస్థాయిలో అవార్డు తీసుకున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల టీచర్ పి.వి.ఎం.నాగజ్యోతి సబ్జెక్టు పరంగా మేలైన బోధన అందిస్తూ క్రీడా రంగంలోను, పలు సంస్థల ఆధ్వర్యంలో అనువాద ప్రతిభతో పలు అవార్డులు పొంది ఆదర్శంగా నిలుస్తున్నారు. మరో ఉపాధ్యాయుడు కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పని చేస్తూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు వృక్ష మిత్ర సంస్థ స్థాపించి 2 లక్షల మొక్కలను మండల వ్యాప్తంగా నాటారు. ఈ మేరకు వారిని సోమవారం ఎంపీపీ యర్రంశెటి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ దోసపత్ని వరలక్ష్మి, ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరరావు, తహసీల్దార్ ఎస్.నాగమ్మ ఎంఈవో జగ్గారావు, మండలంలో కంప్లెక్సు నోడల్ అధికారి శెట్టి మోహన్ పూలమాలలు వేసి సత్కరించారు.

బుడగ జంగాల కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



మంచినీటి సమస్యపై బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

కె.కోటపాడు: కె.కోటపాడులోని బుడగ జంగాలు నివాసం ఉంటున్న కాలనీలో కాలువలు, తాగునీటి సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, యర్రా దేముడు డిమాండ్ చేశారు. గత శుక్రవారం కురిసిన వర్షానికి కాలువల్లో మురుగు జంగాల కాలనీలో వీధుల్లోకి ప్రవహించిందన్నారు. స్థానిక జంగాల కాలనీలో సోమవారం పర్యటించిన వారు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగునీరు కారణంగా తీవ్ర దుర్గంధంతో పాటు అంటువ్యాధులు ప్రభలే పరిస్థితులు ఉన్నాయని రొంగలి ముత్యాలనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. జంగాల కాలనీలో 50 కుటుంబాలు కూడా మూడు వీధి కుళాయిలపైనే తాగునీటికి ఆధారపడాల్సి వస్తుందని చెప్పారు. జల జీవన్ మిషన్ నిధులతో నిర్మాణం జరిపిన ఇంటింటి కుళాయిల నుంచి నీరు ప్రస్తుతం రాలేదని, నీరు వచ్చేలా చేసి ప్రజలకు నీటి కష్టాలను తీర్చాలని ముత్యాలనాయుడు, దేముడు కోరారు. నీటి సమస్యపై స్థానిక బుడగ జంగాల కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. పార్టీ నాయకుడు ఈర్లె నాయుడుబాబు, తదితరులు పాల్గొన్నారు.

వాలాబు రామాలయానికి మైక్ సెట్ వితరణ



రామాలయానికి మైక్ సెట్ అందిస్తున్న సత్య సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు

దేవరాపల్లి: భగవాన్ సత్యసాయి శత జయంతి ఉత్సవాలలో భాగంగా వాలాబు గ్రామంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వాలాబు గ్రామాన్ని దత్తత తీసుకున్న పెదనందిపల్లి సత్య సేవా సమితి భక్తుడు వాలాబులోని 100 మంది గిరిజనులకు దుస్తులు సమకూర్చారు. మహిళలకు చీరలు, పురుషులకు పంచెలు, తువ్వాళ్లను అనకాపల్లి జిల్లా సత్య సేవా సంస్థల అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు చేతులు మీదుగా అందజేశారు. స్థానిక రామాలయానికి మైక్ సెట్‌ను సైతం వితరణ చేశారు. అంతకు ముందు సత్యసాయి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల మండల ఇన్‌చార్జి ఎ.కన్నబాబు, సిహెచ్.వి.రవిశంకర్, పెంటారావు, జగన్నాథం, రమామణి, వాలాబుకు చెందిన శ్రీరాములు, సన్యాసిరావు, సింహాచలం, బాల వికాస్ చిన్నారు లు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

మతా, శిశు మరణాల నివారణే లక్ష్యం



బ్యానర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీవో రమణ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో జ్యోతి

నర్సీపట్నం: మాతా, శిశు మరణాలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని ఆర్డీవో వి.వి.రమణ పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్యశాఖ రూపొందించిన బ్యానర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి, నవజాతి శిశువుల ఆరోగ్యంపై దృష్టిసారించి, మరణాలు సంభవించకుండా చూడాలన్నారు. ఏడాది పొడవునా ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం జిల్లా అదనపు వైద్యాధికారి జ్యోతి మాట్లాడుతూ నాణ్యమైన ఆరోగ్య సంరక్షణకు ఆరోగ్యశాఖ కృషి చేస్తుందన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాల ద్వారా తల్లి, పిల్లల ఆరోగ్యం మెరుగుపడ్డాయన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం వడదెబ్బకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో రూపొందించిన బ్యానర్‌ను ఆర్డీవో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీబీ ముక్త పంచాయతీగా కె.జె.పురం



కె.జె.పురం సచివాలయంలో అవార్డు అందుకుంటున్న వైద్య సిబ్బంది

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామం టీబీ ముక్త పంచాయతీగా ఎంపికై ంది. గ్రామంలో ప్రజలు ఎవరూ టీబీ బారిన పడకుండా ఉన్నట్లు వైద్య సిబ్బంది నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఈ సందర్భంగా కె.జె.పురం పంచాయతీకి గత నెల 24న టీబీ జాతీయ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా అవార్డు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అవార్డును సోమవారం సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి నవీన్‌దొర వైద్య సిబ్బందికి అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణబాబు, ఎంపీటీసీ బీశెట్టి శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ లలిత, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పరిగణనలోకి సర్పంచ్, ఎంపీటీసీల సూచనలు

- అధికారులకు ఎంపీపీ శ్రీనివాసరావు ఆదేశం
- మండల సమావేశంలో పలు సమస్యలపై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

రోలుగుంట: ఉపాధి పనులు, గ్రామాభివృద్ధికి తీసుకుంటున్న నిర్ణయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీల సూచనలు, సలహాలు అధికారులు విధిగా పరిగణనలోకి తీసుకుని, వారిని గౌరవించాల్సిన అవసరం ఉందని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం మండల సమావేశాన్ని ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరరావు నిర్వహించారు. ఎంపీపీ శ్రీనివాసరావు ఆదేశానుసారం శాఖల వారీగా అధికారులు పురోగతిపై మాట్లాడారు. దీనిలో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఈశ్వరరావు శాఖా పరమైన విషయాలు మాట్లాడే సమయంలో జగ్గంపేట నాయుడుపాలెం సర్పంచ్ బగుడు వెంకట రమణ, ఎంపీటీసీ ఉపాధి పనుల కల్పనలో గుండుబాడు, బల్జిపాలెం గ్రామాల ఉపాధి కూలీల మధ్య ఉపాధి పనుల వద్ద వస్తున్న తగాదాలు. పనులు నిలిపివేయడం వంటి సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. అంతే కాకుండా గుండుబాడు రెవెన్యూలో గల చెరువుల్లో జె.నాయుడుపాలెం గ్రామానికి చెందిన ఆయకట్టు రైతులు అధికంగా ఉన్నా, జె.నాయుడుపాలెం గ్రామానికి చెందిన వారికి రెవెన్యూ మీది కాదని, గుండుబాడు గ్రామస్తులకే పనుల్లో ప్రాధాన్యత ఇచ్చి జె.నాయుడుపాలెం కూలీలను దూరం పెట్టడం తగదన్నారు. దీని వల్ల రెండు గ్రామాల కూలీల మధ్య వైరం ఏర్పడుతుందని, అందుకు ఆ శాఖ అధికారులే బాధ్యులన్నారు. జె.నాయుడుపాలెం స్కూలు కాంప్లెక్సు అవసరమైనా ఇక్కడ హైస్కూలు రోలు 200 అయితే, 170 రోలు ఉన్న కుసుర్లపూడిలో మెడ్జి చేసి జె.నాయుడుపాలెం హైస్కూలుకు కాంప్లెక్సు లేకుండా చేయడం తగదని జె.నాయుడుపాలెం ఎంపీటీసీ, సర్పంచ్‌లు ఎంఈవోని మట్లాడుతుండగా ఖండించారు. కె.నాయుడుపాలెం, కొండపాలెం, ఎం.కె.పట్నం, బుచ్చింపేట గ్రామాల్లో ఉపాధి పనులు కల్పన, గ్రామ సభలు నిర్వహణలో సర్పంచ్, ఎంపీటీసీల ఆమోదం తీసుకోకపోవడం బాధాకరమని సభ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎంపీడీవో నాగేశ్వరరావు స్పందిస్తూ గ్రామంలో ఏ విధమైన సంక్షేమాలు అమలు చేసినా, శాఖల వారీగా అభివృద్ధి పనులు చేపట్టినా సర్పంచ్, ఎంపీటీసీల దృష్టికి అధికారులు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రెవెన్యూ శాఖలో అన్ని వర్గాల వారికి ధ్రువ పత్రాలు జారీలో జాప్యం లేకుండా శరవేగంగా పనులు జరగడంపై తహసీల్దార్ నాగమ్మను ప్రజా ప్రతినిధులు అభినందించారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది గ్రామంలో తప్పిపోయిన బాలికను ఎట్టకేలకు ఆమె తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. గత నెల 15న వడ్డాది గ్రామానికి చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ముత్యాల శాంతి(17) ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఆమె తల్లిదండ్రులు 18న ఫిర్యాదు చేయడంతో తమ సిబ్బందితో దర్యాప్తు చేశామని ఎస్ఐ తెలిపారు. బాలిక ఆచూకీ విజయవాడలో లభ్యం కావడంతో బుచ్చెయ్యపేట తీసుకొచ్చి సోమవారం ఆమె తల్లిదండ్రులకు అప్పగించామన్నారు.

రోగులకు రవాణా సదుపాయం



రోగుల కోసం ఏర్పాటు చేసిన బస్సు

బుచ్చెయ్యపేట: పొట్టిదొరపాలెం గ్రామానికి చెందిన వీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డి సత్యారావు రోగులకు ఉచిత బస్సు సదుపాయం కల్పించారు. సోమవారం పలువురు రోగులు విశాఖ ఎన్ఆర్ఐ అనిల్ నీరుకొండ హాస్పటల్‌లో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు పొందడానికి బయలు దేరారు. రావికమతం, కొమ్మళ్లపూడి, పొట్టిదొరపాలెం, బంగారుమెట్ట, వడ్డాదికి చెందిన పలువురు రోగులకు వీఎస్సార్ సంస్థ నుంచి ఉచిత బస్సు సదుపాయం కల్పించి రోగులను ఆస్పత్రికి తరలించి ఉచిత వైద్య సేవలు అందేలా చేశారు. ఈ సందర్భంగా సత్యారావుకు రోగులు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు పైడితల్లికి ఘన నివాళి



పైడితల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడ శివారు కొత్తూరులో ఇటీవల మరణించిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొబ్బిలి పైడితల్లి సంస్మరణ సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సిఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు సంస్మరణ సభలో పాల్గొని పైడితల్లి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అతని కుటుంబ సభ్యులను పరామర్శించా రు. పార్టీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, చోడవరం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, యాదవ సంఘం ముఖ్య నాయకుడు పినబోయిన అప్పారావు యాదవ్ కూడా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొబ్బిలి రాము, కోన సత్యం, బొబ్బిలి పెద అప్పారావు, మహేష్, శ్రీను, కృష్ణ, పినబోయిన ఈశ్వరరావు, మురుకుర్తి శంకరరావు, కోన వెంకటరమణ, బొబ్బిలి వెంకునాయుడు, కోన సన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు త్వరితగతిన పరిష్కారం

అధికారులకు ఆర్డీవో రమణ ఆదేశం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో వి.వి.రమణ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పరిష్కార వేదికలో 25 ఫిర్యాదులు వచ్చాయని ఆర్డీవో తెలిపారు. జగనన్న ఇంటి స్థలంలో పునాది కట్టి ఏడాది అవుతున్నా బిల్లు మంజూరు కాలేదని, హౌసింగ్ అధికారులను అడుగుతుంటే అదిగో..ఇదిగో అంటున్నారు తప్ప ప్రయోజనం లేదని మున్సిపాలిటీకి చెందిన పి.ఈశ్వరమ్మ ఫిర్యాదు చేశారు. టిడ్కో ఇంటి కోసం 2018లో రూ.50 వేలు డీడీ రూపంలో మున్సిపల్ అధికారులకు చెల్లించానని, మంజూరైన ఇల్లు పూర్తి కానందున తమ డబ్బులు తిగిరి ఇచ్చేస్తామన్న అధికారులు ఏడాది అవుతున్నా అతీగతీ లేదని నర్సీపట్నం శాంతినగర్‌కు చెందిన ఆడాది లక్ష్మీ పార్వతి దరఖాస్తు చేశారు. నిలిచిపోయిన పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ నర్సీపట్నం మున్సిపాలిటీ కొత్తవీధికి చెందిన వాకడపూడి లక్ష్మీకుమారి ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. టిడ్కో ఇల్లు మంజూరైనందున 2018లో రూ.లక్ష డీడీ రూపంలో కమిషనర్‌కు చెల్లించామని, ఇల్లు పూర్తి కానందున సొమ్ము తిరిగి ఇచ్చేస్తామని చెప్పి ఏడాది అవుతున్నా అధికారులు సొమ్ము ఇవ్వలేదని నర్సీపట్నం, గొర్లివారి వీధికి చెందిన పెద్దిసుభ ఆర్డీవోకు దరఖాస్తు చేసుకుంది. అధిక వోల్టేజ్ రావటం వల్ల విద్యుత్ మీటర్లు కాలిపోతున్నాయని, ఈ విషయాన్ని అనేక సార్లు విద్యుత్‌శాఖ ఏడీఏ దృష్టికి తీసుకువెళ్లిన ప్రయోజనం లేదని కోళ్లఫారం యజమాని రాజు ఫిర్యాదు చేశారు. భూసమస్యలు, ఇళ్ల స్థలాలు, పెన్షన్ల మంజూరు కోసం ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సువర్ణరాజు

దేవరాపల్లి: ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకొని జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని స్థానిక ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు సూచించారు. ఈ మేరకు వెలుగు కార్యాలయంలో డ్వాక్రా సంఘాలకు వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికల తయారీపై ఎన్యుమరేటర్లకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, రాయితీ వివరాలను ఎంపీడీవో సమగ్రంగా వివరించారు. వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ, మండల పశు వైద్యాధికారి కె.మంజుషారాణి మాట్లాడుతూ ఆయా శాఖల ద్వారా వ్యవసాయానికి, పశువులకు కల్పిస్తున్న రాయితీలపై అవగాహన కల్పించారు. వెలుగు ఏపీఎం ఎస్.ప్రభాకర్ మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి డ్వాక్రా సభ్యుల జీవనోపాధి ప్రణాళిక తయారీ చేసేందుకు ప్రతి సభ్యురాలి అప్పు, రుణం, స్వయం ఉపాధి పెట్టుబడికి అవసరమైన రుణం తదితర వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో పొందిపరచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఐ.బి.చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

దేవరాపల్లి: దేవరాపల్లిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కె.కోటపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వి.మంగతాయారు తెలిపారు. ఈ మేరకు దేవరాపల్లిలో సోమవారం ఆమె వివరాలను వెల్లడించారు. దేవరాపల్లి-2, దేవరాపల్లి-3 అంగన్‌వాడీ కేంద్రాలలో సహాయకురాలి పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని రోస్టర్ విధానంలో ఓసీలకు కేటాయించామన్నారు. ఈ మంగళవారం నుంచి ఈ నెల 17 వరకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను స్వయంగా కె.కోటపాడులోని ప్రాజెక్టు ఆఫీస్‌లో అందజేయాలని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు 2024 జూలై ఒకటో తేదీ నాటికి 21 ఏళ్లు నిండి 35 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి, స్థానికులై ఉండాలన్నారు. రోస్టర్ విధానంలో కేటాయించిన రిజర్వేషన్ ప్రకారం కుల ధ్రువీకరణ పత్రం, వితంతువు అయితే భర్త మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు మైనర్ పిల్లలు ఉంటే వారి వయసు ధ్రువీకరణ పత్రాలను జతపరచాలని సీడీపీవో తెలిపారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నేడు

దేవరాపల్లి: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంక్ అధికారుల సమక్షంలో ఉదయం 10.30 గంటల నుంచి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. మండలానికి 91 యూనిట్స్ కేటాయించగా, 816 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అభ్యర్థులు విద్యార్హత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో కూడిన మూడు సెట్ల దరఖాస్తులు తీసుకుని రావాలన్నారు. ఇంటర్వ్యూలకు హాజరు కాని వారి దరఖాస్తులను తిరస్కరిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

రావికమతం: బీజేపీ నాయకుడు వేపా వెంకట సాయి ఆధ్వర్యంలో కొత్తకోట గ్రామంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ చోడవరం నియోజకవర్గ అధ్యక్షుడు కందర్ప రమణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్ని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు గుటాల చిన్న, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న వీఆర్ఏలు

చీడికాడ: తమ సమస్యలు వెంటనే పరిష్కరించేలా చూడాలని వీఆర్ఏలు సోమవారం తహసీల్దార్ కిషోర్ లింకనకు వినతిపత్రం అందించారు. ఈ మేరకు వీఆర్ఏలు మాట్లాడుతూ నైట్ డ్యూటీలు రద్దు చేసి పేస్కేల్ జీతాలు, అర్హులైన వారికి ప్రమోషన్స్ ఇవ్వడంతో పాటు డీఏలను జీతంలో కలపాలని కోరారు. మే నెలాఖరులోగా ఈ సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే జూన్ 2వ వారంలో సమ్మె చేయనున్నట్టు వారు తెలిపారు.